నల్లపోచమ్మకు ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పూజలు



బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 18వ డివిజన్‌లోని ఇందిరమ్మ కాలనీలోని నల్ల పోచమ్మ దేవాలయాన్ని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ సోమవారం సందర్శించారు. అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాల నేపథ్యంలో ఆయన ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ గోకరి శ్రీలతసురేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. పూజల్లో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్‌ముదిరాజ్, మాజీ మేయర్ మహేందర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పూలపల్లి కృష్ణారెడ్డి, మాజీ కార్పొరేటర్లు సాగర్‌గౌడ్, నాయకులు పాపయ్య యాదవ్, సంగారెడ్డి, హరీష్‌గౌడ్, చంద్రప్రకాష్‌గౌడ్ వెంకటేష్, ప్రకాష్, హీరోలాల్‌నాయక్, గోపాల్‌నాయక్, గోవింద్‌నాయక్, యాదగిరి, రవీందర్, రవినాయక్, పూజారి ప్రభు శర్మ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో దళితులకు ప్రాధాన్యం

శంషాబాద్: రాష్ట్ర మంత్రివర్గంలో మరో ఇద్దరు దళితులకు మంత్రి పదవులివ్వడంతో దళితుల పట్ల కాంగ్రెస్ పార్టీకి ఉన్న నిబద్ధత ఏమిటో నిరూపించుకుందని పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్ అన్నారు. ఎస్సీసెల్ చైర్మన్ ప్రీతమ్ సమక్షంలో సోమవారం ఎస్సీ సెల్ నాయకులు ఘనంగా బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పూర్తిగా దళిత పక్షపాతి అన్నారు. దళితుల అభ్యున్నతే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఈ సందర్భంగా ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకున్నారు.

సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం



సాయిరాం ఎన్‌క్లేవ్‌లో వీధి కుక్కలను పట్టుకుంటున్న సిబ్బంది

బండ్లగూడ: ప్రజలకు ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకుంటున్నామని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర అన్నారు. సోమవారం ఉదయం 5వ డివిజన్‌లోని సాయిరాం ఎన్‌క్లేవ్‌లో డోర్ టూ డోర్ చెత్త సేకరణ, సాయి హర్ష కాలనీలోని అండర్ గ్రౌండ్ డ్రైనేజీ క్లీనింగ్, ఎస్ఎంపీ స్కూల్ రహదారిపై స్వీపింగ్ పనులను పరిశీలించారు. సాయిరాం ఎన్‌క్లేవ్‌లో వీధి కుక్కలను సిబ్బంది చేత పట్టించారు. మాజీ కార్పొరేటర్ శ్రీనాథ్‌రెడ్డి, జి.వెంకట్‌రెడ్డి, వార్డు ఆఫీసర్ స్వాతి, బిల్ కలెక్టర్ నరేందర్‌రెడ్డి, శానిటరీ జవాన్లు తదితరులు పాల్గొన్నారు.

కాముని చెరువులో గుర్రపు డెక్క తొలగింపు



గుర్రపు డెక్కను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

శంషాబాద్: వంద రోజుల ప్రణాళికలో భాగంగా పట్టణంలో కాముని చెరువులో సోమవారం మున్సిపల్ అధికారులు పరిశుభ్రత చర్యలు చేపట్టారు. భాగంగా చెరువులో విస్తరించిన గుర్రపు డెక్కను తొలగించారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా పట్టణంలో ప్రణాళికాబద్ధంగా పారిశుద్ధ్య పనులు చేపడుతున్నామని జేడీపీ పద్మ, మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావు తెలిపారు. పట్టణంలో మౌలిక వసతుల కల్పతో పాటు పట్టణాభివృద్ధికి తీసుకునే చర్యలు చేపడుతున్నామన్నారు. ఏఈ నరేష్, హెల్త్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం



యాదయ్య

శంషాబాద్ రూరల్: కుటుంబ కలహాల కారణంగా వృద్ధుడు ఇంటి నుంచి వెళ్లి అదృశ్యమయ్యాడు. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి సమాచారం మేరకు... సంఘీగూడకు చెందిన వట్టెల యాదయ్య(75), మల్లమ్మ దంపతులకు కుటుంబం విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మే 31న యాదయ్య తన టీవీఎస్ బైక్ తీసుకుని ఎవరికి చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయాడు. తిరిగి రాకపోవడంతో పలు ప్రాంతాల్లో వాకబు చేసినా ఫలితం లేదు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కిస్మత్‌పూర్, బండ్లగూడవాసులకు...

తీరనున్న ట్రాఫిక్ కష్టాలు!

- వంద అడుగుల రోడ్డు నిర్మాణానికి అధికారులు చర్యలు
- ఇప్పటికే నిర్మాణదారులకు నోటీసులు అందజేత



రోడ్డు విస్తరణకు గతంలో వేసిన మార్కింగ్



కిస్మత్‌పూర్‌లో విస్తరించనున్న రహదారి

రాజేంద్రనగర్: కిస్మత్‌పూర్, బండ్లగూడవాసుల ట్రాఫిక్ కష్టాలు త్వరలో తీరనున్నాయి. ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించేందుకు ఐదేళ్ల క్రితమే వంద అడుగుల మేర రోడ్డును విస్తరించాలని అధికారులు నిర్ణయించారు. వివిధ కారణాలతో ఆ పనులు కాస్తా కాగితాలకే పరిమితం అయ్యాయి. ప్రస్తుతం స్థానికంగా బస్తీలు, కాలనీలు, అపార్ట్‌మెంట్‌లు, విల్లాలు పెరిగిపోతుండటంతో రోడ్డు విస్తరణ పనులు అనివార్యంగా చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇందులో భాగంగా కిస్మత్‌పూర్ అపోలో మెడికల్ షాపు నుంచి బండ్లగూడ పెట్రోల్ పంపు వరకు రోడ్డుకు ఇరువైపుల ఉన్న నిర్మాణాలకు బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు నోటీసులను జారీ చేస్తున్నారు. గతంలో రోడ్డు విస్తరణకు మార్కింగ్ చేసినా నోటీసులు అందించలేదు.

- స్థానికుల అభ్యర్థనలు, ప్రజా ప్రతినిధుల విన్నపాలతో 60 అడుగులు ఒకసారి, 80 అడుగుల ఒకసారి అంటూ ప్రణాళికలను రూపొందించారు. ప్రస్తుతం రోజుకు రోజుకు ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతుండటంతో 100 అడుగుల రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.

దాదాపు 200లకు పైగా నిర్మాణాలు...

కిస్మత్‌పూర్‌లోని అపోలో ఫార్మసి నుంచి బండ్లగూడ పెట్రోల్ పంపు వరకు 100 అడుగుల రోడ్డు విస్తరణలో భాగంగా అధికారులు తగు ప్రణాళికలు రూపొందించారు. రోడ్డుకు ఇరువైపుల 200లకు పైగా నిర్మాణాలు అడ్డుగా ఉన్నాయని నిర్ధారించారు. ఆయా నిర్మాణాలకు ప్రస్తుతం నోటీసులు అందిస్తున్నారు. ఈ నోటీసులో రోడ్డు నిర్మాణంలో ఎంత మేర స్థలం వెళ్తుందో వివరాలను అందిస్తున్నారు.

గతంలో మార్కింగ్...

ఏడాదిన్నర క్రితం ఈ రహదారి విస్తరణకు అధికారులు సర్వే చేపట్టారు. 100 అడుగుల మేర నిర్మాణం కోసం నిర్మాణాలకు మార్కింగ్‌కు చేశారు. మార్కింగ్ చేసిన సమయంలో స్థానికుల నుంచి పెద్ద ఎత్తున అభ్యంతరాలు వెల్లువెత్తడంతో పాటు ప్రజాప్రతినిధులను ఆశ్రయించడంతో ఆ పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. మార్కింగ్ పూర్తయినా ఎలాంటి పనులను నిర్వహించలేదు.

పెరుగుతున్న రద్దీ...

కిస్మత్‌పూర్, బండ్లగూడ ప్రాంతాలు రోజురోజుకూ విస్తరిస్తున్నాయి. కొత్త కాలనీలు, బస్తీలు, అపార్ట్‌మెంట్‌లు, విల్లాలను నిర్మిస్తున్నారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ ప్రాంతానికి ప్రధాన రహదారి కేవలం 30 అడుగుల వరకు మాత్రమే ఉంది. నిత్యం పరిసర ప్రాంతాలకు చెందిన వాహనదారులతో ఈ రోడ్డు రద్దీగా ఉంటుంది. దీనికి తోడు ఈ ప్రాంతంలోనే ప్రముఖ పాఠశాలలు ఉండటంతో ఉదయం, సాయంత్రం వేళల్లో అడుగు తీసి అడుగు వేసేందుకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

- ట్రాఫిక్ జామ్ కారణంగా నిత్యం స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. 100 అడుగుల రోడ్డును నిర్మిస్తే స్థానికులకు ట్రాఫిక్ కష్టాలు దూరం అవుతాయనడం నిర్వివాదాంశం.

రాజేంద్రనగర్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా

- రూ. 5.81 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- అభివృద్ధి నిరంతర ప్రక్రియ: ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



బండ్లగూడలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

బండ్లగూడ: కాలనీలు, బస్తీలనే తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి మెరుగైన వసతులు కల్పించి రాజేంద్రనగర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సోమవారం 1, 6, 12వ డివిజన్‌లలో కమిషనర్ శరత్‌చంద్రతో కలిసి రూ. 5.81 కోట్ల నిధులతో చేపట్టే వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు.

- 12వ డివిజన్‌లోని పోలీస్ అకాడమీ, 6వ డివిజన్ సన్‌సిటీ దగ్గర అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు గాను రూ. 72 లక్షల నిధులతో శంకుస్థాపన చేశారు.
- 1వ డివిజన్‌లోని యాదయ్య నగర్ కాలనీ, తిరుమల హిల్స్, శ్రీనివాసనగర్ కాలనీ, విఘ్నేశ్వర కాలనీ, కేకే నగర్, వేంకటేశ్వర కాలనీ, శివసాయి నగర్ ఫేస్1,2, బీఎంఆర్ విష్ణుపురి కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు. ఇంద్రారెడ్డి కాలనీ, వెంకటేశ్వర్ కాలనీ, శివసాయినగర్ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణం కోసం 1వ డివిజన్‌లో మొత్తం రూ. 5.09 కోట్ల నిధుల పనులకు శంకుస్థాపనలు చేశారు.
- ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత కల్పిస్తుందని అన్నారు. అభివృద్ధి నిరంతర ప్రక్రియ అని ఆయన వెల్లడించారు. గతంలో బండ్లగూడ జాగీర్‌లో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు లేక ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారన్నారు. ఇప్పుడు కాలనీలలో సీసీ రోడ్డులు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులు వేగవంతగా జరుగుతున్నాయని తెలిపారు. ప్రతి డివిజన్‌లో అవసరమైన అభివృద్ధి పనులు యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నామని ఆయన వెల్లడించారు. వచ్చే నాలుగేళ్లలో అభివృద్ధిలో బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ రూపురేఖలు మారుస్తామని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ మేయర్ మహేందర్‌గౌడ్, మాజీ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు సాగర్‌గౌడ్, గోకరి శ్రీలత సురేష్‌గౌడ్, తలారి చంద్రశేఖర్, శ్రీనాథ్‌రెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి, సంగారెడ్డి, ఖాజపాషా, హరీష్‌గౌడ్, గణేష్ మున్సిపల్ డీఈ యాదయ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సాగులో యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన



సంఘీగూడలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు



రాయన్నగూడలో పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

శంషాబాద్ రూరల్: భూసార పరీక్షల ఆధారంగా పంటల సాగుతో పాటు సరైన మోతాదులో ఎరువులు వాడుకోవాలని నేల ఆరోగ్య యాజమాన్య సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.పవన్ చంద్రారెడ్డి సూచించారు. 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు, వికసిత కృషి సంకల్ప్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని సంఘీగూడలో రైతులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. వాతావరణ ఆధారిత సలహాలు, నాణ్యమైన విత్తనాల ఎంపిక, సాగునీటి వద్ధతులు, రసాయనాల వాడకం గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో సూక్ష్మ పోషకాల విభాగం శాస్త్రవేత్త డాక్టర్ కె.రాజమణి, ఏఈఓ రాఘవేందర్, రైతులు పాల్గొన్నారు.

రాయన్నగూడలో...

పంటలకు మోతాదు మించి రసాయన ఎరువుల వాడకంతో పెట్టుబడి ఖర్చులు పెరగడంతో పాటు నేలకు హాని జరుగుతుందని శాస్త్రవేత్త డాక్టర్ సుకృత్‌కుమార్ హెచ్చరించారు. అఖిల భారత సూక్ష్మ పోషకాల విభాగం ఆధ్వర్యంలో రైతులకు సాగులో యాజమాన్య పద్ధతులను వివరించారు. పంట మార్పిడితో చీడపీడల నివారణతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ రాజశేఖర్, ఏఈఓ సురేష్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని ప్రైవేటు స్కూల్స్‌పై చర్యలు తీసుకోండి



ఎంఈఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మణికొండ: సరైన అనుమతులు, సౌకర్యాలు లేకుండా కనీస నిబంధనలు పాటించకుండా అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, జిల్లా కార్యదర్శి ఎస్.మల్లేష్ కోరారు. ఈమేరకు గండిపేట ఎంఈఓ విజయ్‌కుమార్‌కు సోమవారం నార్సింగిలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ... మండల పరిధిలో చాలా పాఠశాలల్లో ప్లే గ్రౌండ్‌లు లేవని, ఇరుకు గదుల్లో విద్యార్థులను ఉంచి విద్యాబోధన చేస్తున్నారన్నారు. విద్యార్థుల నుంచి నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. వెంటనే అలాంటి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి బాబురావు, నాయకులు శ్రీనివాస్, శ్రీకాంత్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

శంషాబాద్ రూరల్: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ సురేష్‌రెడ్డి తెలిపారు. ఓం జైభవానీ ఫీడర్ పరిధిలోని తొండుపల్లి, కిషన్‌గూడ, ఊట్‌పల్లి గ్రామాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు.

ఉపాధి అంశాల్లో ఉచిత శిక్షణ

శంషాబాద్ రూరల్: శంషాబాద్ మండలంలోని ముచ్చింతల్ శివారులో ఉన్న స్వర్ణ భారత్ ట్రస్టులో టైలరింగ్, సీసీ టీవీ ప్రోగ్రాంలో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్వర్ణ భారత్ ట్రస్టు, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా, జీఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శిక్షణ ఉంటుందన్నారు. టైలరింగ్‌లో 30 రోజులు, సీసీ టీవీ ప్రోగ్రాంలో 13 రోజుల పాటు శిక్షణ ఇస్తారని తెలిపారు. జూన్ 10 నుంచి ఈ శిక్షణ ప్రారంభం అవుతుందన్నారు. 19 నుంచి 45 ఏళ్ల వయస్సు ఉండి పదో తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులు అని తెలిపారు. శిక్షణ సమయంలో ఉచిత వసతి, భోజనం సౌకర్యం కల్పిస్తారన్నా. ఔత్సాహికులు తగు ధ్రువీకరణ పత్రాలతో కార్యాలయంలో సంప్రదించాలన్నారు. వివరాలకు ఫోన్స్: 93914 87797, 78931 21143లలో సంప్రదించాలని సూచించారు.

టీబీ రహిత సమాజమే లక్ష్యం

మైలార్‌దేవ్‌పల్లిలో 'టీబీ ముక్త్ భారత్ అభియాన్'



టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో పాల్గొన్న డాక్టర్ పాపారావు తదితరులు

మైలార్‌దేవ్‌పల్లి: టీబీ రహిత భారతదేశ నిర్మాణమే లక్ష్యంగా దేశవ్యాప్తంగా చేపట్టిన టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా సోమవారం మైలార్‌దేవ్‌పల్లి యూపీహెచ్‌సీలో రాజేంద్రనగర్ టీబీ యూనిట్ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో టీబీని గుర్తించి నిర్ధారించడానికి స్పూటం శాంపిల్స్, ట్రూనాట్ టెస్టులు, ఎక్స్‌రే టెస్టులు వంటి వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. మొత్తం 55 మంది రోగులకు శిబిరంలో పరీక్షలు చేశారు. డాక్టర్ చేతన్, శ్రీనివాసుల పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో డీఎంహెచ్‌వో, టీబీ నివారణ అధికారి డాక్టర్ పాపారావు క్యాంపును సందర్శించి టీబీ అభియాన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... టీబీ పూర్తిగా నయమయ్యే వ్యాధి అని స్పష్టం చేశారు. ఈ వ్యాధి పట్ల ప్రజల్లో అవగాహన పెంచడం చాలా అవసరమన్నారు. ప్రత్యేక శిబిరాల ద్వారా ముందుగానే గుర్తింపు, ఉచిత వైద్యం ద్వారా టీబీ నివారణ సాధ్యమేనన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. కుటుంబ సభ్యుల ఆరోగ్యాన్ని కూడా పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌టీబీ కోఆర్డినేటర్, ఎస్‌టీఎల్ఎస్ రహీం, ఎస్‌టీఎస్ నరేష్‌కుమార్, సీవో చంద్రకళ, స్టాఫ్ నర్స్ రోజారాణి, ఆశా వర్కర్లు ఐసీటీసీ పద్మ, కౌన్సిలర్ గీత, ఆర్‌బీటీ డాక్టర్ జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిత

ఆల్ కాలనీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు వంశీ



విజేత జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న వంశీ

మణికొండ: ప్రస్తుత ఉరుకుల, పరుగుల జీవితం, శారీరక శ్రమ లేకపోవటం, ఒత్తిడుల మధ్య జీవనం లాంటివి చేస్తున్న మనకు ఆటలు ఎంతో ముఖ్యమైనవని మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ఆల్ కాలనీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు వంశీ అన్నారు. క్రీడల్లో రాణించే వారికి ఉజ్వల భవిష్యత్ సాకారం అవుతుందని ఆయన పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని అలకాపూర్ టౌన్ షిప్ ఎంజీ పార్కులో మణికొండ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన టోర్నమెంట్ ముగింపు కార్యక్రమం ఆదివారం రాత్రి జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ... ప్రతి ఒక్కరి జీవితంలో ఆటలను దినచర్యగా చేసుకుంటే ఎంతో ఆరోగ్యంగా జీవించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఇలాంటి టోర్నమెంట్‌లలో పాల్గొనే క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఫైనల్ మ్యాచ్ మణికొండ, కూకట్‌పల్లి టీముల మధ్య హోరాహోరీగా సాగింది. కూకట్‌పల్లి టీం విజేతగా నిలిచింది. విన్నర్, రన్నర్ టీములను ఆయన ట్రోఫీలను అందజేశారు. మాజీ వార్డు సభ్యుడు కె.శ్రీనివాస్‌రెడ్డి, బ్యాడ్మింటన్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.


ప్రధాని మోదీ ప్రగతి పాలనను ప్రజలకు వివరించాలి



మాట్లాడుతున్న బీజేపీ సీనియర్ నేత ప్రభాకర్‌రెడ్డి

రాజేంద్రనగర్: దేశ ప్రధానిగా నరేంద్రమోదీ 11 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జరిగిన దేశంలో జరిగిన అభివృద్ధి, అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభ్యున్నతి కోసం చేపట్టిన పథకాలను బీజేపీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు వివరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆ పార్టీ రాజేంద్రనగర్ డివిజన్ సీనియర్ నాయకుడు ప్రభారి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, బొక్క బాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. బీజేపీ రాజేంద్రనగర్ డివిజన్ వర్క్‌సాప్‌ను సోమవారం ఉప్పర్‌పల్లిలోని పీఆర్ ప్యాలెస్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వారు మాట్లాడుతూ... పార్టీ అధిష్టానం ప్రధానంగా మూడు అంశాలతో ఈ కార్యక్రమాన్ని రూపొందించిందన్నారు. ఇంటర్నేషనల్ యోగా డేను విజయవంతం చేయాలన్నారు. తల్లికి వందనం కార్యక్రమం ప్రధానమైందన్నారు. ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరిట ఒక మొక్కను నాటి సంరక్షించాలని సూచించారు. ఆయా కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలన్నారు. రాజేంద్రనగర్ డివిజన్ పార్టీ అధ్యక్షుడు సందీప్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో హరికిషన్ జీ, సోల్కర్ రెడ్డి, జిల్లా మహిళా మోర్చా కార్యదర్శిని మేకల వనితా రెడ్డి, మల్లేష్ చారి, విఠల్, కీర్తి శ్రీను, వెంకటేష్, బాలకృష్ణ, సురేందర్, శ్రీకాంత్ రెడ్డి, రాఘవేంద్ర చారి, రవి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ఐపీఈ-సిటీ కాలేజీ మధ్య విద్యా సహకార ఒప్పందం



చార్మినార్: ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్ (ఐపీఈ)-ఓయూ క్యాంపస్, సిటీ కాలేజ్ (అటానమస్) సోమవారం విద్యాపరమైన అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఈ ఒప్పందం మూడేళ్ల పాటు అమలులో ఉంటుంది. ఈ ఒప్పందంపై ఐపీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్. శ్రీనివాస మూర్తి, ఐపీఈ పీజీడీఎం ప్రోగ్రామ్ హెడ్ ప్రొఫెసర్ డాక్టర్ రామకృష్ణ యలమంచిలి, సిటీ కాలేజ్ వైస్ ప్రిన్సిపాల్ డా.పి.శాంతి, వాణిజ్య విభాగ అధిపతి మల్లికార్జున రావు, అధ్యాపకులు ఝాన్సీ రాణి, ఇఫ్రత్ ఉన్నిసా సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ మూర్తి మాట్లాడుతూ..ఈ ఒప్పందం విద్యా సంస్థలు, వ్యాపార ప్రపంచం మధ్య ఒక ఆచరణాత్మక వంతెనలా పనిచేస్తుందన్నారు. డా.పి. శాంతి మాట్లాడుతూ... ఐపీఈ సంస్థ విలువైన వనరులు సిటీ కాలేజ్ అనుభవంతో కలవడం వల్ల విద్యార్థులకు పరిశోధన, ఇంటర్న్‌షిప్‌లు, ఉద్యోగ అవకాశాలు మరింత విస్తృతమవుతాయన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రికి పెరుగుతున్న ఆదరణ

రోగులకు ఉచితంగా వైద్యం

- ప్రభుత్వ ఆస్పత్రిలోనే ఖరీదైన వైద్య పరీక్షలు
- డయాగ్నోస్టిక్ హబ్‌కి నిత్యం 30కి పైగా పరీక్షల శాంపిల్స్
- శంషాబాద్ ఆస్పత్రికి మంజూరైన ట్రూనాట్ యంత్రం



శంషాబాద్‌లోని ప్రభుత్వ ఆస్పత్రి

శంషాబాద్: శంషాబాద్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిని ఆశ్రయించే పేద రోగులకు వైద్య పరీక్షల ఆర్థిక భారం తప్పుతోంది. ఆస్పత్రి ద్వారానే అన్నిరకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తుండటం వారికి ఆర్థికంగా ఎంతో మేలు చేస్తోంది. సర్కారు దవాఖానాకు వచ్చే రోగులకు సంబంధించిన వైద్య పరీక్షలు డయాగ్నోస్టిక్ హబ్ ద్వారా పూర్తి చేసి రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తుండటంతో శంషాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి రోగుల సంఖ్య పెరుగుతోంది.


రోగ నిర్ధారణే కీలకం...

రోగులకు సరైన వైద్యం అందించే విషయంలో రోగ నిర్ధారణే ఎంతో కీలకమైంది. ప్రైవేటులో వేలకు వేలు పోసి వైద్య పరీక్షలు చేయించుకోడానికి పేద ప్రజలకు ఆర్థికంగా భారంగా మారుతోంది. దీంతో రోగులు పరీక్షలు చేయించుకోకుండానే కాలం వెళ్లదీసే పరిస్థితులుంటాయి. ప్రస్తుతం ప్రభుత్వ దవాఖానా తలుపు తట్టిన రోగులకు అన్నిరకాల వైద్య పరీక్షలు ఉచితంగా జరుగుతున్న తీరు ఆర్థికంగా రోగులకు ఎంతో మేలు చేస్తోంది. శంషాబాద్ మున్సిపాలిటీలోని సామాజిక ఆస్పత్రికి నుంచి ప్రతి రోజూ కీలకమైన వైద్య పరీక్షల కోసం రక్త, మల, మూత్ర నమునాలను సేకరించి జిల్లా డయాగ్నోస్టిక్ హబ్‌కు పంపుతున్నారు. ప్రాథమిక పరీక్షలను స్థానికంగానే చేపడుతున్నారు. డయాబెటిక్, కిడ్నీ, లివర్ పరీక్షలతో పాటు బి 12, విటమిన్ డి తదితర లోపాలకు సంబంధించిన అత్యంత ఖరీదైన వైద్య పరీక్షలను సైతం ఇక్కడి వైద్యుల సిఫార్సు మేరకు ఉచితంగా పొందుతున్నారు.

మరికొద్ది రోజుల్లో టీబీ పరీక్షలు...

శంషాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో మరికొద్ది రోజుల్లో టీబీ పరీక్షలు సైతం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. టీబీ పరీక్షలు నిర్వహించే ట్రూనాట్ అనే యంత్రం కూడా ఆస్పత్రికి మంజూరైంది. దీంతో స్థానికంగానే క్షయవ్యాధిగ్రస్తులకు టీబీ పరీక్షలు నిర్వహించే వెసులుబాటు సైతం ఆస్పత్రిలో అందుబాటులో రానుండడంతో స్థానికంగా ప్రభుత్వ ఆస్పత్రిని ఆశ్రయించే రోగులకు మేలు చేకూరనుంది.

సద్వినియోగం చేసుకోవాలి...



ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్యంతో పాటు ఉచితంగా అన్ని రకాల వైద్యపరీక్షలు అందుబాటులో ఉన్నాయి. ఆస్పత్రి వైద్యుల సిఫార్సు మేరకు రోజూ పదుల సంఖ్యలో ఖరీదైన వైద్య పరీక్షలను జిల్లా డయాగ్నోస్టిక్ హబ్ ద్వారా చేయిస్తున్నాయి. క్షయ వ్యాధిని నిర్ధారించే ట్రూనాట్ యంత్రం కూడా ఆస్పకిరి మంజూరైంది. మరికొద్ది రోజుల్లో స్థానికంగానే టీబీ నిర్ధారణ పరీక్షలు కూడా నిర్వహిస్తాం. ప్రభుత్వ ఆస్పత్రిని ఆశ్రయించే పేదరోగులు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకుని మెరుగైన వైద్య సేవలు పొందాలి.

- డాక్టర్ దుర్గలత, శంషాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్